

# శ్రీ వేంకటేశ్వర లీలలు

## ప్రాణంపోసిన స్వామి

**శ్రీమతి యర్రమిల్లి లలితారత్నం,**
**హైదరాబాదు.**

నిర్గుణ, నిరాకార పరంబ్రహ్మ, సాకారుడై, నిత్య కల్యాణోత్సవ మూర్తిగా, శ్రీ శ్రీనివాసుడై, ఏడుకొండల మీద కొలువై, ఆశతో, ఆర్తితో, ఆపదలో అనుగ్రహం కోసం అర్థించేవారిని అనుక్షణం ఆదరిస్తున్నాడు. ఇది నిత్యసత్యం. ప్రతిరోజూ లక్షలాది జనం శ్రీనివాసుని దర్శనం కోసం దేశం నలు మూలల నుంచి వచ్చి, వేచి దర్శించి తరిస్తున్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందు మనసులో మెదిలేది ఆపద మొక్కుల వాడు శ్రీ వేంకటేశ్వరుని రూపమే. తమ ఆపద తీరితే, ఏదో ఒక మొక్కు చెల్లిస్తామని మనసారా స్వామిని తలచుకొని ముడుపు కడితే, ఆ ఆపదను గట్టెక్కిస్తాడు.

అప్పుడు నాకు పదమూడేళ్లు. మా పెద్దక్కయ్య కూతురు హేమకు 3 వ ఏట చాలా సుస్తీ చేసింది. పిల్ల బ్రతకదనే అనుకున్నారు. అప్పుడు మా అక్కయ్య ముడుపుకట్టి-- ''స్వామీ! ఈ పిల్లని నీకే ఇచ్చేస్తున్నాను. చేతి గాజులు హుండీలో వేస్తాను. పిల్ల బరువు కర్పూరం వెలిగిస్తాను. బ్రతికించే భారం నీదే'' అని మొరపెట్టుకుంది. ఆ తర్వాత జరిగింది అద్భుత మనే చెప్పవచ్చు. ఆఖరి క్షణాల్లో ఉందని, తీసుకెళ్లటానికి ఏర్పాట్లు కూడా చేశారు. అప్పుడు ఆ స్వామి పంపినట్లుగానే ఓ హోమియో డాక్టరు వచ్చారు. ''అమ్మా! ఆఖరి ప్రయత్నం. ఓ మందు పోస్తున్నాను. ఆపై వెంకన్న దయ'' అని ఒక చుక్క మందు పెదాలపై వేశారు. మా అందరి ఆశలు ఊపిరి పోసుకున్నట్లు, ఆ స్వామి కరుణకు అవధీ, పరిధీ లేవని నిరూపించటానికి ప్రత్యక్ష నిదర్శనంగా, అప్పటిదాకా మన లోకంలో లేని పిల్ల, నాలుక



బయటపెట్టి, ఆ మందు చుక్కని లోపలికి తీసుకుంది. డాక్టరు వారితో పాటు మేమూ ఆ ఏడుకొండల వాడికి నమోవాకాలర్పించాము.

పిల్ల బాగా కోలుకున్న తరువాత తిరుపతి ప్రయాణం పెట్టుకున్నారు. అప్పటికి మా మేనత్త ఒకామె పక్షవాతంతో మంచంలో ఉండేవారు. స్వామి తరచుగా ఆమె వంటి మీదకి వచ్చి, ఏవో చెబుతుండే వారు. అప్పుడప్పుడు మా అక్కయ్య వంటి మీదకు కూడా వచ్చేవారు. ప్రయాణానికి ఓ గంట సమయం వుందనగా, అక్కయ్య పిల్ల చేతిగాజులు లేవని చూసింది. ఇంటిల్లి పాదీ మూల మూలలా వెతికాం. ఎక్కడా లేవు. అప్పుడు జరిగింది ఓ అద్భుతం. ఆ జరిగిన సంఘటన సత్యం. కానీ ఇది అక్షర సత్యం. మంచంలో వున్న మా మేనత్త వంటి మీదికి స్వామివచ్చి-- ''ఏం వెతుకు తున్నారు? పిల్ల గాజులా? తోలుపెట్టె బెల్టులకి తొడిగింది.. చూసుకోండి'' అని చెప్పారు. నిజానికి మా మేనత్తగారు అసలు లేవలేరు. ప్రయాణానికని సర్దిపెట్టిన తోలుపెట్టె (ఆ రోజుల్లో సూట్‌కేస్‌ని తోలుపెట్టె అనేవారు) ఆమె ఉన్న గదికి దూరంగా వుంది. వెంటనే స్వామికి కొబ్బరికాయ కొట్టి, హారతి ఇచ్చి వెళ్లిచూస్తే అక్కడ రెండుగాజులు వున్నాయి. మనసారా స్వామిని తలచుకొంటె ఆపదలను ఆ స్వామే తీరుస్తాడు. ఇందుకు మా అనుభవమే నిదర్శనం.